# నేనేమీ కాను!

రచన:
శ్రీ. జె. అప్పారావు

ఈ ప్రపంచంలో నేనేమీ కాను. బుర్రల వెక్కింపుతో, రాజకీయపు చదరంగంలో అకస్మాత్తుగా మహానాయకుడై, రోజు వ్యవధిలో పదివేలు రూపాయలతో పసందుగా కట్టబడిన ఎత్తయిన, ఇంకా ఎత్తయిన ఉక్కు దిమ్మల వేదికనెక్కి, విద్యుత్ పాము దీపాల మధ్య, చికాగో మైకుల రొదలో, ఉక్కు టోపీల, ఎఱ్ఱ మేదరబుట్టల కాపలాలో, దేశంలో ఇప్పుడున్న దైన్యాన్నీ, రేపు రాబోయే స్వర్గాన్నీ తొణుకూ బెణుకూ లేకుండా ఉపన్యాస మిచ్చుకుపోతూన్న మహానాయకుడికి—ఇసుకలో, రొంపిలో, బురదలో, సన్నని కానజల్లులో పది నూరుల మనుష్యులమధ్య, చీమతలకాయలలో తలకాయనై, రేణువులో రేణువునై, వెలుతురూ, చీకటీ పెనుగులాడే క్రీనీడలో నిలబడి, నోరెళ్ళబెట్టి ఆసక్తిగా వింటూన్న నేను ఏమీ కాను!

పది అంతస్థుల మేడ పైభాగంలో 'ఎయిర్ కండిషన్డు' గదిలో ప్రపంచ చిత్రాన్ని ముందు పరుచుకొని, పరుగెడుతూన్న చరిత్రను, కళ్ళెంతో పట్టి, పత్రికలో, పత్రిక పంక్తుల్లో, పత్రిక పంక్తుల అక్షరాల్లో బంధించి, పరాకాష్ట నందుకున్న సంపాదక మహాశయునికి—ఎండలో, వానలో, దివారాత్రాలలో, పట్నం ఘాటు రోడ్లపై సగం స్పోక్సు పుల్లలులేని సైకిలు చక్రాలతో, బండెడు బరువుతో, 'కుక్కలున్నాయి జాగ్రత్త' గేట్లు తోసుకుంటూ, పై అంతస్థులో పడకకుర్చీలో పవ్వళించిన ఇంటి యజమానికి, సకాలంలో పత్రిక నందజేస్తున్న 'పేపరు బోయ్'ని నేను ఏమీ కాను!

'సర్జికల్ క్వాడ్రేంగిల్' మధ్య అంతస్థులో పట్టపగలు కిటికీల, తలుపుల తెరలు మూయించుకొని, గదిలో విద్యుత్తులో ఉక్కు రెక్కల పక్షి క్రింద అపర శివుడిలా 'స్టెతోస్కోపు' నాగుపామును మెడకు చుట్టుకొని, విదేశ యాత్రనుగూర్చి, ధ్యానముద్రలో దీర్ఘంగా జడిస్తూన్న ఖరీదైన 'ఎక్స్‌పర్టు'కు—అవుట్ పేషెంటు చీకటి కోణంలోంచి, చీటీలో రాసిన పదిహేనో నెంబరు వార్డు ఎక్కడో తెలియక, అడిగితే చెప్పేవారు లేక, చెప్పినా అర్థం చేసుకోలేక, ఎటు పోవాలో అర్థంకాక సతమతమయ్యే దీర్ఘ సుఖవ్యాధిగ్రస్తుడనైన నేను ఏమీ కాను! అయితే తన ప్రయోగాలకు, పరిశోధనలకు పనికివచ్చే పనిముట్టునుమాత్రమే.

విశాఖపట్నం కొండ కోనలో నూరువరహాల చెట్టు క్రింద క్రొత్తగా వెలిసిన సత్యన్నారాయణమూర్తి గుడి ముందు నిద్రగన్నేరుచెట్టు నీడలో అప్పుడే కట్టిన పెళ్ళి పీనుపై చిత్రానికి లక్ష రూపాయిలు పుచ్చుకుంటూ నూటఒక్కటో పెళ్ళి చేసుకొనేందుకు, ప్రొడ్యూసరిచ్చిన కట్నంతో 'అవుట్‌డోరు షూటింగు'కొచ్చిన సినీ భార్యా-భర్తలకు—వెండితెరపైన నిర్జీవమైన సెల్యూలాయిడ్ బొమ్మలు, ప్రాణస్పందనం కలిగిన సజీవమూర్తులుగా ఉంటే ఎలా వుంటాయో చూద్దామనే కుతూహలంతో మానవుల గుంపుల రొంపిలోంచి, పోలీసుల లాఠీలకు ఓర్చుకుంటూ తోసుకుంటూ, తన్నుకుంటూ, తలపైకెత్తి చూడలేకపోయిన నేను ఏమీ కాను!

పెరిగిన పేడపెరుగులాంటి పెద్ద కారులో, అప్సరస వేణినిమించే నల్లని తారువూతపై, అప్రయత్నంగా జారిపోతూ, స్టీరింగును నడుపుతూన్న ఎర్రని లిప్‌స్టిక్ పెదవులకు, ప్రక్కనున్న టెరిలీను షర్టుకూ—ఏదో పరధ్యాన్నంగా ఆలోచించుకుంటూ, కారులోంచి విసరబడ్డ అమృతపాణీ అరిటిపండు తొక్కపై అమాంతంగా జారిపడిన నేనేమీ కాను!

'కుష్టురోగుల శరణాల'యానికి అధ్వర్యంవహిస్తూ, వివిధ సాంఘిక సంక్షేమ సంస్థలు మంజూరుచేసే సొమ్మును సొంతానికి వాడుకుంటూ, పరీక్షించవచ్చిన పర్యవేక్షకులను పొట్టపగిలేట్లు డిన్నరిచ్చి పంపుతూ, పత్రికల్లో దీనజనపరాయణుడనే పరపతినిపొందిన సంఘసంస్కర్తకు—శరణాలయంలో ఒళ్ళు కుళ్ళి, చీము కారుతూ, ఈగలు కొరుకుతూ, దోమలు డొల్లుతూ, నూతిలోంచి మాట్లాడే గొంతుకతో, తల్లిదండ్రులు పెట్టిన పేరు మరిచిపోయి 'కుష్టువెధవ' అన్న పేరే జ్ఞాపకంవున్న నేను ఏమీ కాను!

మెయిన్‌రోడ్డులో హడావుడిగా పోతూన్న సిటీ బస్సులో ఎక్కేవారెవరో, దిగేవారెవరో, డబ్బులిచ్చేవారెవరో తెలియక, 'షిఫ్టు' మారేవేళ దగ్గిరవుతూన్న

కొద్దీ ఇల్లు జ్ఞాపకానికొస్తున్న కండక్టరుకు—బస్సులో జాగాలేక నిలువవేసిన క్రీస్తులా, పైదండెం పట్టుకొని వ్రేలాడుతూ నిలబడ్డ నేను మరో 'టిక్కట్టు'ను మాత్రమే.

కాలక్షేపానికై కల్పింపబడే 'కాక్‌టెయిల్' పార్టీలతో కాలాన్ని ఎలా ఖర్చుపెట్టాలో తెలియక, డవాలా బంట్రోతులాంటి క్రాసుబెల్టుతో, బహూకరింపబడిన బంగారు పతకాల బరువు కాయలేని భుజాలతో, స్టాకు ఎక్స్చేంజి స్టీలు షేర్ల ధరల్ని పెంచేనిమిత్తం, రాజకీయ నాయకులతో పొత్తుకలిపి యుద్ధానికి హుకుములిచ్చిన ఆర్మీ జనరల్‌కు—చీమలు దూరని చిట్టడవుల్లో, పాములా భూమ్మీద ప్రాకుతూ, పువ్వులు పెట్టుకొని, నవ్వుతూన్న భార్య గుర్తుకురాగా, పుట్టి నెలరోజులైనా కాని చంటిపాప ఎర్రటి పెదవుల సందుల్లోంచి జారుతూన్న చిరునవ్వు స్మృతిపథంలో మెరయగా, ఎదుటివాళ్ళను ఎందుకు చంపాలో అర్థంకాకుండానే చంపేస్తున్న సామాన్య సైనికుడనైన నేనేమీకాను!

తమాషా ఎలాగుంటుందో చూద్దామని అమాయికమైన సరదాతో వచ్చి, చల్లగా సవాయిరోగమంటించుకొని సాగిపోయిన నూతన కాలేజీ విద్యార్థికి—పట్టణం ఇముడ్చుకోలేని మిగతా కుళ్ళును నాలోకి నింపుకొని, నగరాన్ని దుర్గంధంనుండి రక్షిస్తున్న వెలయాలిని నేను ఏమీకాను!

ఎక్కడా సరుకు దొరకక, చీకటి బజారులో రెట్టింపు ధరలకు సరుకు కొనుక్కుని, ఆ ఉక్కు కడ్డీలతో చక్కటి ఇల్లు కట్టించుకొని సాయంకాలం సంధ్యాసమయంలో చల్లగాలికి 'టెర్రస్'పై విహరిస్తోన్న షావుకారుకు—మరుగుతూన్న ఉక్కు సరస్సులో నిప్పుముద్దలను బైటకు లాగి, పోతపోసి, జీవం వేశి, కడ్డీలుగా సాగగొడుతూ, 'నేను మానవుడు బ్రతకవలసిన నూరేళ్ళు బ్రతకను ఫించనీ యివ్వాలని నువ్వేమీ భయపడకు. నలభై ఏళ్ళలోపుగానే ఛస్తానని యిందుమూలముగా నీకు హామీ యిచ్చుచున్నాను' అని ఖరారైన బాండుపై మిల్లు యజమానితో బాండులో సంతకం చేసిన ఉక్కుఫేక్టరీ కార్మికుడను నేనేమీకాను!

'నువ్వు మొదలెట్టేవు కాబట్టి నేనూ మొదలెట్టానోహో! 'అని జబ్బలుకొట్టుకుంటూ, తొడలు చరుచుకొంటూ, ఒకళ్ళకొకళ్ళు పోటీపడుతూ భగవంతుడిచ్చిన నేలను, నీటిని, గాలిని కలుషితంచేస్తున్న అణ్వస్త్రనాయకులకు—భార్య కుక్కలా, కొడుకు పందిలా, కూతురు గాడిదలా మారిపోయి, 'వీళ్ళకే హక్కు ఎవ్వడిచ్చాడురా భగవంతుడా'అని విస్తుపోతూ 'కేన్సరు'తో చావు బ్రతుకుల సంధ్యలోనున్న నేను ఏమీకాను!

అడివి పందుల్లా, ఊరకుక్కల్లా, మకరదున్నపోతుల్లా రంకె వేసుకుంటూ ఖనిజాల షేర్లపై కొట్లాడుకొనే 'స్టాకు ఎక్స్చేంజి' బ్రోకర్లకు—భూమాత కడుపు చీల్చుకుంటూ, అంతు తెలియని గాఢంలోకి పోతూ, అంధకారాన్నే ఆకలేస్తే నెమరేసుకుంటూ, అనుక్షణమూ మృత్యువుతో నృత్యంచేసే గనిలోని కార్మికుడను నేనేమీకాను!

మెత్తని సందువాలు, తాజారెయ్యలు, కొవ్విన జెల్లలు, వజ్రంలాంటి వంజరాలు దగ్గిరుండి భార్యతో వండించుకొని, సాయంకాలం పిల్లలు, భార్యతో వేడివేడి అన్నంలో నంజుకుంటూ గుటకలేస్తున్న సంసారికి—శుక్రాచార్యుడు దూ:కపూర్వమే పెనుభూతంలాంటి నల్లమబ్బులు దేవుడిచ్చిన చుక్కల వెల్తురునుకూడ మ్రింగేసి, నిద్రపోయి, నెమరువేసుకుంటూండగా, ఒంటరిగా కొయ్యపడవలో, మేడికొండ శిఖరం ఆంబోతు మూపురంలా కన్పించేటంత దూరంగా సముద్రంలోకి పోయి, వలవేసుకుంటూ, పడవలో విలయనృత్యం చేస్తూ, హిమానీనదాల్లాంటి సముద్రపు పులులతో సయ్యాటలాడుతూ సాయంకాలానికి బజారు విడిపోతుందేమోనవే ఆతృతతో వడి, వడిగా ఒడ్డుకు చేరటానికి తంటాలుపడే జాలారిని నేనేమీకాను

ఒకసారి కాఫీ, ఇడ్లీలకు కొంచెం ధర పెంచుతూ, మరోసారి అచేపదార్థాల సైజును తగ్గిస్తూ, మూడోసారి మళ్ళా వాటిధరలు పెంచుతూ, నాలుగోసారి వాటిసైజు ఇంకా తగ్గిస్తూ, ధరల పెరుగుదల, సైజు తగ్గుదల వీటిలో వొచ్చే లాభాలతో మలబారులో కొబ్బరితోటలు కొంటూ, కేరళలో కలప మిల్లులు కట్టిస్తూ, ఒకనిశరాత్రి బోర్డు త్రిప్పి, బల్లలు బోర్లించి జైపరమేశ్వరా, పద్మనాభా అంటూ అకస్మాత్తుగా ఆంధ్రదేశంనుండి అంతరానమవుతూన్న మణిఅయ్యర్లకు—తెలకలి గానుగ ఎద్దులా తిరిగినచోటే తిరుగుతూ, రోజుకి కనీసం పదిమైళ్ళన్నా హోటల్లో గుండ్రంగా తిరుగుతూ, ఐన్‌స్టీనుకు కూడా లేని జ్ఞాపకశక్తిని పొందివుండి, నల్లటి బట్టలతో, సిఫిలిస్ చేతులతో, నెలకొక హోటల్ మారుతున్న 'సెర్వరు'ను నేను ఏమీకాను!

అయితే నేనేమికావాలి? నే నెవర్ని? ఆకాశానికి భూమికి ఏమి సంబంధమో; జ్యోతిర్మండలంలో కొత్తగా పుట్టిన నక్షత్రానికి, భూమండలంలో అప్పుడే పుట్టిన ఇసుపగనికీ ఏమిసంబంధమో, సగుణత్వానికీ, నిర్గుణత్వానికి ఏమి సంబంధమో; నాకూ వారికీ అదేసంబంధము. ఒకప్పుడు వారు నేనవుతారు, నేను వారవుతాను. ఆ రోజులురాకపోవు.